క్లుప్తంగా

అంగన్‌వాడీలు బాధ్యతగా పని చేయాలి

నరసన్నపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ అన్నారు. మండలంలోని 115 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు మంజూరైన యూనిఫాం, వివిధ సామగ్రిని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు, లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో నాగమణి ఉన్నారు.

గృహసారథులే కీలకం



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

జలుమూరు: రానున్న ఎన్నికల్లో గృహసారథులే కీలకమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. అల్లాడ గ్రామంలో గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్లకు అప్పగించిన 50 ఇళ్లకు ప్రభుత్వ పథకాలు అందేలా గృహసారథులు కూడా కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. సమావేశంలో అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, సచివాలయ మండల కన్వీనర్ ధర్మాన జగన్ ఉన్నారు.

పిల్లలకు సంస్కృతిని నేర్పాలి

ఎల్.ఎన్.పేట: పెద్దలను గౌరవించేలా పిల్లలకు సంస్కృతిని నేర్పించాల్సిన అవసరం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులపై ఉందని భగవాన్ శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు అన్నారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి మందిరంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, పంచాంగ కర్త ఇప్పిలి వేణుగోపాలరావును గ్రామస్తులు శుక్రవారం సత్కరించారు. విద్యార్థులు ఎలా ఉండాలి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే ఎలాంటి ప్రణాళిక అవసరం అనే అంశాలపై ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో బాలవికాస్ గురువు లావేటి శైలజ, దుర్గారావు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

పాతపట్నం: మండల వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన 'జగనన్నకి చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 1920కి ఫోన్‌చేసి లబ్ధిదారులు సమస్యలు చెబితే తక్షణమే ఆయా శాఖ స్పందించాలన్నారు. ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈవోపీఆర్డీ క్రిష్టారావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు కరవంజ విద్యార్థి

జలుమూరు: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–17 విభాగంలో కరవంజ ఉన్నత పాఠశాల విద్యార్థి బోనం సూర్యతేజ ఎంపికై నట్లు హెచ్‌ఎం టి.ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పీడీ సుజాత తెలిపారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- నరసన్నపేట మండల సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: రైతులకు అవసరమైన ఎరువులకు కొరత లేకుండా చూడడంతోపాటు సక్రమంగా సరఫరా చేయాలని ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఎరువుల సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనికి వ్యవసాయాధికారి కె.సునీత బదులిస్తూ ఇప్పటికే మండలంలో 720 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామన్నారు. డిమాండ్ మేరకు ఎరువులు కావాలని ఉన్నతాధికారులను కోరామన్నారు. సాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని, పెండింగ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలని పలువురు సభ్యులు వంశధార ఏఈ సురేష్‌ను కోరారు. దేవాదిలో శ్మశానవాటికకు వెళ్లే మార్గం ఆక్రమణలో ఉందని.. వీటిని తొలగిస్తే రోడ్డు నిర్మాణం చేసుకుంటామని సర్పంచ్ మంతిన రాము తహసీల్దార్ సింహాచలాన్ని కోరారు. జగనన్న కాలనీతో పాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని.. దీనికి ప్రభుత్వం రూ. 6 వేలు చెల్లిస్తోందని గృహ నిర్మాణ శాఖ ఏఈ శంకరరావు చెప్పారు. ఎంపీడీవో బి.మధుసూదనరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ



పాతపట్నం: పింఛన్‌దారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- ఉత్సాహంగా నూతన పింఛన్ల పంపిణీ

సారవకోట: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బొంతు గ్రామానికి చెందిన పలువురికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని ఐటీడీఏ పీవో కల్పనాకుమారితో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సచివాలయాల ద్వారా ఎవ్వరి ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలాకి, సారవకోట జెడ్పీటీసీ సభ్యులు ధర్మాన కృష్ణచైతన్య, వరుదు నాగేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు పల్లి శ్రీహరి, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు బొంగు కొండయ్య, చిన్న ఆదినారాయణ, శ్యామసుందరరావు పాల్గొన్నారు.

పేదలకు భరోసా: ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వైఎస్సార్ పింఛన్ కానుక భరోసాగా నిలుస్తోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం గ్రామ సచివాలయం–1 వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 429 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే తప్ప పింఛన్లు వచ్చేవి కాదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రమాణికంగా, పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం పింఛన్‌దారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్, ఈవో కూర్మారావు, ఎంపీపీ దొర సావిత్రమ్మ, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, బుర్లె శ్రీను, వై.వెంకటరమణ, ఎం.చంద్రయ్య, పసుకు మోహన్, తూలుగు ప్రవీన్, వైస్ సర్పంచ్ మమత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నను దీవించండి

జలుమూరు: సంక్షేమ రథసారధి.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ దీవించాలని ఎంపీపీ వాన గోపీ అన్నారు. శ్రీముఖలింగంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 225 కొత్త పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవ వెంకటరమణ ఉన్నారు.



జలుమూరు: మాట్లాడుతున్న ఎంపీపీ గోపి



సారవకోట: పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

వైద్యరంగంలో సమూల మార్పులు

- వైద్య, విద్య రంగాలపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: వైద్యరంగంలో సమూల మార్పులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని వంశధార గెస్ట్ హౌస్ సమీపంలో రూ.5.75 కోట్ల అంచనాతో 3.11 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న 30 పడకల సామాజిక ఆస్పత్రి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను అందించే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా, ప్రభుత్వ ఆస్పత్రులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సర్కార్ తీర్చిదిద్దుతోందన్నారు. వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం, సర్కారీ వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు అద్భుతమైన పురోగతిలో ముందడుగు వేస్తున్నాయన్నారు. గతంతో పోల్చితే వైద్యరంగం అట్టడుగువర్గాలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. దీంతో వైద్యరంగం ఒక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని విజ్ఞులైన మేధావి వర్గం, ప్రజానీకం గమనించాలని సూచించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అప్ గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యులు సక్రమంగా సేవలు అందించినప్పుడే ప్రభుత్వ వైద్యం ప్రజాభిమానాన్ని చూరగొంటుందన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల సిబ్బంది జవాబుదారీ తనంతో వ్యవహరించాలన్నారు. వైద్యానికి అవసరమయ్యే పరికరాలు, మందులు అందుబాటులో ఉంచుకునేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్, అర్బన్ హెల్త్ సెంటర్లు, మొబైల్ వైద్యం వంటివి ప్రజలకు ఆలంబనగా నిలుస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ వైద్య సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావటమే అంతిమ లక్ష్యమన్నారు. సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు వైస్ ఎంపీపీలు కరణం కృష్ణమనాయుడు, మానుకొండ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్‌ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, బెవర మల్లేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచులు మొండేటి కూర్మారావు, గురుగుబెల్లి, నీలారావ్, నాయకులు దుంపల శ్యామలరావు,శిల్లా మల్లికార్జునరావు, బొడ్డేపల్లి రవి, దుంపల చిరంజీవి, కుసుమంచి శ్యాం ప్రసాద్, పొదిలాపు తిరుపతి, సాధు చిరంజీవి, సువ్వారి వెంకటరమణ, మామిడి రమేష్‌కుమార్, పొన్నాడ చిన్నారావు, బొడ్డేపల్లి రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు .

జనసైనికులను నట్టేట ముంచారు

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో టీడీపీతో కలిసి వెళ్తామని ప్రకటించి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జనసైనికులను నట్టేటముంచారని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆయనను నమ్ముకున్న వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిందే చంద్రబాబు కోసం అన్నట్లుగా ఉందన్నారు. 2014లో పార్టీ పెట్టి పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు తెలిపారన్నారు. అవినీతిని ప్రశ్నిస్తానని చెప్పుకునే ఆయన చంద్రబాబు అవినీతిపై ఏమీ మాట్లాడకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవాలని 2019లో బీఎస్పీ, కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసిన పవన్‌కల్యాణ్ 2024లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామనడంలో ఆంతర్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గతంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఆయనను నమ్ముకున్న నాయకులు, అభిమానులను నట్టేట ముంచారని గుర్తుచేశారు. ఇప్పుడు పవన్‌కల్యాణ్ కూడా అదే బాటలో వెళ్లారన్నారు. ఆయన నిలకడలేని నాయకుడని, ఎమ్మెల్యేగా గెలవకముందే టీడీపీ, బీజేపీ, కమ్యూనిస్టులు, బీఎస్పీ, మళ్లీ బీజేపీ, టీడీపీలతో పొత్తులు పెట్టుకోవడం చూస్తే ఆయన నిలకడలేని తనం తేటతెల్లమౌతోందన్నారు. పవన్ కల్యాణ్ తల్లిని, జనసైనికులను తిట్టిన లోకేష్, బాలకృష్ణలను పక్కన పెట్టుకుని టీడీపీతో కలిసిపోయారంటే ఆయన ఆ పార్టీకి ఎలా అమ్ముడుపోయాడో అర్థమవుతోందన్నారు. ప్రతి సమావేశంలో నీతికబుర్లు చెప్పే పవన్ కల్యాణ్.. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, రాజధాని నిర్మాణాలు కేసులో ఇన్‌కాం టాక్స్ నోటీసులకు సంబంధించి ఒక్కమాట కూడా అనకపోవడం ఆయన లాలూచీకి నిదర్శనమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కెప్టెన్ రామారావు, సువ్వారి మనోహర్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, రామ్మోహన్ ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- కేళవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



కేళవలసలో బ్రోచర్లను అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

సారవకోట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పద్మాపురం, కేళవలస గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని తెలియజేయడంతోపాటు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు రావాడ భాస్కరరావు, రెడ్డి పాపయ్య, పార్టీ మండల అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు చిన్నాల సింహాచలం, కొండాల బాబూరావు, శంకరబాబు, బాడాన కృష్ణారావు, సాగిపల్లి దండాశి, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, నాయకులు వరుదు దేవీప్రసాద్, రెడ్డి తులసి, నక్క తులసీదాస్, రావాడ శ్రీనివాసరావు, నిక్కు రాజశేఖర్, యాళ్ల శ్యామసుందరరావు, మెండ రామకృష్ణ, పొన్నాన మోహనరావు, మెండ సూర్యనారాయణ, అప్పన్న, అరియాపల్లి రాము, నిక్కు కృష్ణారావు ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విజయనగరంలోని మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సీఎం జగన్ ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు.

–ఎల్.ఎన్.పేట



గడప గడపతో సమస్యల పరిష్కారం

- స్పీకర్ సీతారాం



వృద్ధురాలికి సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వీఆర్ గూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, నాయకులు గాడు నాగరాజు, సువ్వారి అప్పలనాయుడు, పేడాద రాములు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి భవానీశంకర్

మెళియాపుట్టి: జగనన్నకు చెబుదాం, ఆరోగ్యసురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పలుశాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో సమీక్షించారు. ప్రజలు వారి అవసరాల నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మొదలు పెట్టారని అన్నారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఆరోగ్యసురక్షలో భాగంగా గ్రామవాలంటీర్లకు ఇచ్చిన యాప్ ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలన్నారు. అనంతరం ఏఎన్ఎంలు సుగర్, రక్తపరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 రోజులకు మించి దగ్గు ఉంటే కెల్ల పరీక్షలు చేస్తారన్నారు. దీనిపై జిల్లాకలెక్టర్ సమీక్షలు నిర్వహిస్తారని ప్రత్యేకదృష్టితో పనిచేయాలన్నారు. ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో తిరుపతి పట్నాయక్, చాపర, మెళియాపుట్టి, కరజాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆమదాలవలస రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్తంగా..

ఓజోన్‌పొరను కాపాడుకుందాం



గొడుగులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పొందూరు: ఓజోన్‌పొరను కాపాడుకుంటే అది భూమిని గొడుగులా రక్షిస్తోందని తాడివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఓజోన్‌పొరపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గొడుగులను పట్టుకుని సింబాలిక్‌గా నిలబడ్డారు. హెచ్‌ఎం బల్ల కంటయ్య, సైన్సు ఉపాధ్యాయులు సాయికుమార్, పాపారావు ఓజోన్ పొర విశిష్టతను తెలిపారు.

సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

నరసన్నపేట: నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఎం.విజయానందకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎం.తిరుపతిరావు ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల ఎంపీడీవోగా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు.

నరసన్నన్నపేట ఈవోపీఆర్డీగా రామకృష్ణారావు

నరసన్నపేట: నరసన్నపేట మండల ఈవోపీఆర్డీగా నియమితులైన జి.రామకృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజాం మండలంలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన జీవీ రవికుమార్ ఎంపీడీవోగా పదోన్నతిపై విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

బూర్జ మండలానికి విజయలక్ష్మి

బూర్జ: మండల ఈవోపీఆర్డీగా పి.విజయలక్ష్మి శుక్రవారం విధుల్లో చేరారు. ఈమె ఇదివరకు డీపీఆర్డీ రిసోర్సు పర్సన్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎల్.ఎన్.పేటకు పద్మజ..

ఎల్.ఎన్.పేట: మండల ఈవోపీఆర్డీగా ఐ.పద్మజ విధుల్లో చేరారని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ తెలిపారు. రాజాం మండలం పొగిరి పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఈమె పదోన్నతితో కూడిన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

విశ్వేశ్వరయ్యకు ఘనగా నివాళులు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో ఇంజినీరింగ్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామానికి చెందిన ఇంజినీర్ సోమేశ్వరరావును ఘనగా సత్కరించారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సేవ ప్రముఖ్ గుడ్ల బాబు అన్నారు. ఆమదాలవలస పట్టణంలో 800 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మెళియాపుట్టి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలు ఉండేలా చూసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (జిల్లా పరిషత్ సీఈవో) వెంకట్రామన్ అన్నారు. బందపల్లి, మర్రిపాడు–సీ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. బీఎల్‌వోల పనితీరుపై ఆరాతీశారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో చంద్రకుమారి, వీఆర్వోలు అన్నాజీరావు, సత్యన్నారాయణ ఉన్నారు.

గృహసారథులకు బీమా నమోదు

మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురం, గొప్పిలి, కరజాడ, చాపర సచివాలయాల పరిధిలోని గృహసారథులకు బీమా నమోదు ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు తాళాబత్తుల ప్రసాదరావు, పోలాకి జయమునిరావు, కరణం శశిభూషణరావు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన

కొత్తూరు: ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ కొత్తూరులోని జూనియర్ జడ్జి కోర్టు న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలియజేశారు. బార్ అసోసియేషన్ చైర్మన్ అప్పారావు, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, రవికిరణ్, ఫాల్గుణరావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనపై అవగాహన

సరుబుజ్జిలి: విద్యార్థులు దురలవాట్లకు బానిసలు కాకుండా మంచి మార్గంలో పయనించాలని ఎస్సై కూటికుప్పల కృష్ణ ప్రసాద్ అన్నారు. రొట్టవలస కేరళ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సత్ప్రవర్తనపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఉన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం

మెళియాపుట్టి: ఆంపురం గ్రామ పంచాయతీ పరిధి బంజీరుపేట గ్రామంలో ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జమ్మయ్య తెలిపారు. ఈ గ్రామంలో నీటి సమస్య ఉండడంతో గిరిజన కుటుంబాలు ఇబ్బందిపడేవి. సమస్యను ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి సుమారు రూ.లక్ష నిధులు మంజూరు చేశారు. ఆ మొత్తంతో ట్యాంకు నిర్మించడంతో సమస్య పరిష్కారమైంది.

గ్రామ సంఘం కార్యాలయం ప్రారంభం

ఆమదాలవలస రూరల్: మహిళా స్వయం శక్తి సంఘాలు అభివృద్ధి చెందడానికి గ్రామసంఘం కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ చిలకపల్లి సురేష్ అన్నారు. వెదుళ్లవలస గ్రామ పంచాయతీలో గ్రామసంఘం కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.